సాక్షి చిత్తూరు

గురువారం । 8 । ఫిబ్రవరి । 2024



డీఆర్‌ఓగా పుల్లయ్య..

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాన ని జిల్లా డీఆర్‌ఓగా బాధ్యతలు స్వీకరించిన పుల్లయ్య అన్నారు. - 8లో



చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించండి

ఎన్నికల విధులను ప్రతిఒక్కరూ చిత్తశుద్ధితో నిర్వర్తించాలని ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలకు కలెక్టర్ షణ్మోహన్ సూచించారు. - 8లో



ప్రజాసంక్షేమ బడ్జెట్

రాష్ట్రప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ లో సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వడంపై సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. - 8లో

న్యూస్‌రీల్

మొగిలీశ్వరుని సేవలో పీఠాధిపతి



మొగిలీశ్వరస్వామి ఆలయంలో విద్యాప్రసన్నతీర్థ స్వామి

బంగారుపాళెం: స్వయంభు శ్రీమొగిలీశ్వర స్వామి వారిని బుధవారం సాయంత్రం కర్నాట కలోని కుక్కే సుబ్రహ్మణ్యేశ్వరస్వామి పీఠా ధిపతి శ్రీవిద్యాప్రసన్న తీర్థ మహాస్వామి దర్శించుకున్నారు. స్వామివారిని దర్శించుకు నేందుకు విచ్చేసిన ఆయనకు సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి శ్రీమొగిలీశ్వర స్వామి, కామాక్షమ్మవారి దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం దేవ రకొండ సమీపంలో పాణ్యం శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శివపార్వతుల గోశాలను సందర్శించారు.

జాతీయస్థాయి పోటీలకు ఐరాల విద్యార్థి



సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థితో స్కూల్ హెచ్‌ఎం, పీడీ

ఐరాల: జాతీయ స్థాయి జూనియర్స్ సాఫ్ట్‌బాల్ పోటీలకు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి వంశీకృష్ణ ఎంపికైనట్లు బుధ వారం హెచ్‌ఎం కోమల తెలిపారు. ఆమె మాట్లాడుతూ ఇటీవల అన్నమయ్య జిల్లా సుం డుపల్లె ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి జూని యర్స్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో విశేష ప్రతిభ కన బరచి జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు తమ విద్యార్థి ఎంపికయ్యారని చెప్పారు. ఈ నెల 20 నుంచి 25వ తేదీ వరకు బిహార్ రాష్ట్రం పాట్నాలో నిర్వహించనున్న జాతీయస్థాయి జూనియర్స్ పోటీల్లో విద్యార్థి వంశీకృష్ణ పాల్గొంటారని వెల్లడించారు. ఈ సందర్భంగా క్రీడాకారున్ని జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు జనార్దన్‌యాదవ్, కార్యదర్శి రమేష్, పీడీ దేవా అభినందించారు.

14న సామూహిక అక్షరాభ్యాసం

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో ఈ నెల 14న బుధవారం సామూహిక అక్షరాభ్యాస కార్య క్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. ఈ నెల 14న వసంత పంచమి సందర్భంగా ఆలయంలో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు స్వామివారి ఆస్థాన మండపంలో ఆలయ ఆధ్వర్యంలో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ అక్షరాభ్యాసానికి వచ్చే వారిలో ఒక్కొక్కరికి రూ.200 టికెట్ ఉంటుందని వివ రించారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్విని యోగం చేసుకోవాలని కోరారు.

డీఎస్సీ అభ్యర్థుల్లో ఆనందోత్సాహాలు

– ఉమ్మడి జిల్లాలో 337 టీచర్ పోస్టులు

చిత్తూరు కలెక్టరేట్: ఎన్నో రోజులుగా ఎదురు చూస్తున్న డీఎస్సీ అభ్యర్థులకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. బుధవారం డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల కావడంతో టీచర్ కొలు వుల కోసం ఎదురు చూస్తున్న నిరుద్యోగుల్లో ఆనందం వ్యక్తం అయి ంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 337 పోస్టులను డీఎస్సీలో భర్తీ చేయను న్నారు. ఇందులో ఎస్జీటీలు 101, స్కూల్ అసిస్టెం ట్‌లు 97, టీజీటీలు 139 పోస్టులను భర్తీ చేయను న్నట్లు విద్యాశాఖ అధికారుల సమాచారం.

ఆడుదాం ఆంధ్ర రాష్ట్ర స్థాయి పోటీలకు పయనం



జెండా ఊపి బస్సులను ప్రారంభిస్తున్న డీఆర్‌ఓ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాస్థాయిలో గెలుపొంది రాష్ట్రస్థాయి ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీల్లో పాల్గొ నేందుకు జిల్లా క్రీడాకారులు పయనమయ్యారు. బుధవారం జిల్లా కేంద్రంలోని మెసానికల్ మైదానం నుంచి ప్రత్యేక బస్సులు విశాఖపట్నం కు బయలుదేరి వెళ్లాయి. ఈ బస్సులను డీఆర్‌ఓ పుల్లయ్య జెండా ఊపి ప్రారంభించారు. అనం తరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లా తరఫున రాష్ట్రస్థాయిలో పాల్గొంటున్న క్రీడాకా రులు ప్రతిభ చాటి జిల్లాకు మంచి పేరు తీసుకు రావాలన్నారు. ఈ పోటీలకు జిల్లా నుంచి 103 మంది క్రీడాకారులు వెళ్లారని తెలిపారు. కార్యక్ర మంలో డ్వామా పీడీ రాజశేఖర్, డీఎస్‌డీఓ బాలా జీ, డీఎల్‌డీఓ రవికుమార్ పాల్గొన్నారు.





పుంగనూరు పట్టణ ముఖచిత్రం

పుంగనూరు.. అభివృద్ధికి మారుపేరు

కర్నాటక సరిహద్దుల్లో కరువుకు నిలయంగా ఉన్న పుంగనూరును గతంలో నలభైఏళ్ల పాటు ఒకే కుటుంబం పాలించినా అభివృద్ధి జాడ లేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధి కారంలోకి రాగానే ముఖ్యమంత్రి వైఎస్ జగ న్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట మేరకు రూ.375.16 కోట్లు ప్రత్యేక నిధులు కేటాయిం చారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎం పీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి ప్రత్యేక ప్రణాళి కలు చేపట్టి మున్సిపాలిటీ రూపురేఖలు మార్చేశారు. వందల రూ.కోట్లతో అభివృద్ధి పరుగులు తీస్తోంది.

- ఆదర్శ పుంగనూరు మున్సిపాలిటీకి సీఎం జగన్ ఎనలేని సహకారం
- ఫలించిన మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి పక్కా ప్రణాళికలు
- రూ.6 కోట్లతో అత్యున్నత ప్రమాణాలతో బస్టాండ్ నిర్మాణం
- రూ.110 కోట్లతో అత్యంత సుందరంగా టిడ్కో గృహాల నిర్మాణం

పుంగనూరు: ఏళ్ల తరబడి అభివృద్ధికి ఆమడదూరం లో నిలిచిపోయిన పుంగనూరు పట్టణం ఈ ఐదే ళ్లలో రూపురేఖలు మారిపోయాయి. జమీందారుల కాలంలో సుమారు 60 ఏళ్ల కిందట ఏర్పాటైన ఎం బీటీ రోడ్డుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రావడంతో మహర్దశ పట్టింది. రూ.52 కోట్లతో సుమారు 60 అడుగుల మేర రోడ్డును విస్తరించి మధ్యలో డివై డర్లు, ఎల్‌ఈడీ దీపాలు ఏర్పాటు చేసే పనులు చురుగ్గా సాగుతున్నాయి. అలాగే కౌండిన్య నది కాలువలో రూ.20 కోట్లతో పూడికతీసి సిమెంటు కాలువలు నిర్మించే కార్యక్రమం చేపట్టారు. ఎన్నో ఏళ్లుగా పుంగనూరు ప్రజలకు ఎండమావిగా మారిన ఆర్టీసీ డిపోను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రావడంతో సుమారు రూ.6 కోట్లతో నిర్మించారు. 2021 సంవత్సరంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో ప్రారంభిం చారు. అలాగే 110 బస్సులతో ప్రజలకు సేవలు అందిస్తున్నారు.

సోలార్ వెలుగులు..

రాష్ట్రంలో ఏ మున్సిపాలిటీలో లేనివిధంగా రూ.6 కోట్లతో మున్సిపాలిటీలో సోలార్ ప్రాజె క్టును ఏర్పాటు చేశారు. ప్రతి నెల రూ.30 లక్షలు విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్నారు. విద్యుత్ వినియోగాన్ని తగ్గించి భారంగా ఉన్న విద్యుత్ బిల్లుల నిధులను అభివృద్ధి పనులకు కేటా యించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు.



ప్రభుత్వం ఏర్పాటు చేసిన సోలార్ ప్రాజెక్టు

జగనన్న పట్టణాలు..

పట్టణ సమీపంలోని జగనన్న కాలనీల్లో గూడూరుపల్లి వద్ద రూ.110 కోట్లతో అత్యంత సుందరంగా నిర్మించిన టిడ్కో గృహాలను 1,536 మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అలాగే 1266 మందికి ఇళ్ల స్థలాలు కేటాయిం చారు. రోడ్లు, కాలువలు, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయడంతో జగనన్న కాలనీలు పట్టణాలను తలపిస్తున్నాయి.



పుంగనూరులో ప్రారంభించిన టిడ్కో గృహాలు

బైపాస్ రోడ్డు..

ఎంబీటీ రోడ్డును అనుసంధానం చేస్తూ పట్టణ సమీపంలోని అరబిక్ కళాశాల నుంచి భీమగాని పల్లి వరకు 8 కిలోమీటర్ల బైపాస్ రోడ్డును సుమారు రూ.230 కోట్లతో ఏర్పాటు చేశారు. అలాగే పట్టణంలోని కోర్టు రోడ్డును రూ.6 కోట్లతో సుమారు 60 అడుగుల రోడ్డును వేశారు. రోడ్డు మధ్యన డివైడరు ఏర్పాటు వేసి ఎల్‌ఈడీ దీపాలు ఏర్పాటు చేయడంతో బైపాస్‌రోడ్డు అత్యంత సుందరంగా మారింది. అలాగే పుం గమ్మ చెరువు కట్టను రూ.5 కోట్లతో విస్తరించే కార్యక్రమం చురుగ్గా సాగుతోంది.



పుంగనూరు: మినీ బైపాస్ రోడ్డు

సుందరమైన పార్కులు..

పట్టణంలోని పుంగమ్మ చెరువు కట్ట నుంచి ప్రభుత్వాస్పత్రి వరకు మధ్య గల ప్రాంతంలో ప్రజలు ఆహ్లాదకర వాతావరణంలో జీవించేం దుకు సుమారు రూ.4 కోట్లతో పార్కులు ఏర్పాటు చేశారు. చెరువుకట్టపై రూ.3.12 కోట్లతో పార్కు పనులు పూర్తి కావొస్తోంది. ఎల్‌ఈడీ దీపాలు, వాకింగ్‌ట్రాక్, వివిధ పూలమొక్కలు పెట్టి, బెంచ్‌లు ఏర్పాటు చేయ నున్నారు. అలాగే గోకుల్ సర్కిల్, ఎల్‌ఐసీ కాలనీలో కూడా చిన్నపార్కులు, అందులో వ్యాయామం, చిన్నపిల్లలు ఆటల కోసం వస్తు వులు ఏర్పాటు చేయనున్నారు.



పుంగనూరులో నిర్మిస్తున్న పార్కు

ప్రధాన కార్యాలయాల ఏర్పాటు..

ప్రజలకు, రైతులకు ఎంతో అనుకూలంగా ఉం డేందుకు పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో సుమారు రూ.4 కోట్లతో మండల భవన సముదాయం నిర్మించారు. అలాగే ట్రాన్స్‌కో డివిజన్ కార్యాలయాన్ని నూతనంగా ప్రారం భించారు. అలాగే నూతన భవనాలకు రూ.3 కోట్లు కేటాయించారు. పనులు చురుగ్గా సాగు తున్నాయి. పట్టణంలో ఆర్టీఓ కార్యాలయాన్ని ప్రారంభించారు. పక్కా భవనాల కోసం 2 ఎక రాల స్థలాన్ని కేటాయించారు. అలాగే కుమ్మర నత్తం పంచాయతీలో రూ.కోట్లతో ట్రాన్స్ ఫార్మర్ల ఫ్యాక్టరీ ఏర్పాటు చేశారు.



పుంగనూరులో ఏర్పాటు చేసిన ఆర్టీఓ ఆఫీసు

చేపట్టిన పనులు..

పట్టణంలో నాడు–నేడు పథకం కింద 16 స్కూ ళ్లను రూ.1.90 కోట్లతో అభివృద్ధి చేశారు. అలాగే ప్రత్యేక గ్రాంటు ద్వారా రూ.20 కోట్లతో కాలు వలు, రోడ్లు, పైపులైన్లు కలిపి 230 పనులు చేపట్టేందుకు టెండర్లు ఆహ్వానించారు. అలాగే వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్లను రూ.1.60 కోట్లతో నిర్మించారు. పట్టణంలోని ఎంబీటీ రోడ్డులోని ట్రావెలర్స్ బంగ్లాలో సుమారు రూ.3 కోట్లతో జెడ్పీ విశ్రాంతి భవనం నిర్మించారు. ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందించేందుకు ఎం పీ మిథున్‌రెడ్డి నిధులతో ప్రతి వార్డులో ఒక్కో ఆర్‌ఓఆర్ ప్లాంటు నిర్మించారు.



త్వరలో ప్రారంభించనున్న జెడ్పీ అతిథి గృహం

పట్టణంలో ప్రముఖుల విగ్రహాలు..

పట్టణంలో పలువురు ప్రముఖుల విగ్రహాలు ఏర్పాటు చేసేందుకు మంత్రి పెద్దిరెడ్డి రామచం ద్రారెడ్డి స్థలాలు, సొంత నిధులను కేటాయించా రు. భీమగానిపల్లి వద్ద శ్రీకృష్ణ దేవరాయల విగ్ర హం, చదళ్ల సర్కిల్‌లో ఉయ్యాలవాడ నరసిం హారెడ్డి, ఇందిరా సర్కిల్‌లో వాల్మీకి, పూలే, తెలుగు తల్లి విగ్రహాలను ఏర్పాటు చేయించారు. అరబిక్ కళాశాల సర్కిల్‌లో అల్లూరి సీతారామరాజు విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించారు.

వైఎస్సార్‌సీపీతో విముక్తి..



కరువుకాటకాలతో ఎలాంటి అభివృద్ధికి నోచుకోని పుంగనూ రుకు వైఎస్సార్‌సీపీ పాలనలో విముక్తి లభించింది. 30 ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని మున్సిపాలిటీలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కోట్లాది రూపాయలు తీసు కొచ్చి అభివృద్ధి చేపట్టారు. ఐదేళ్లలో మున్సిపాలిటీ రూపురేఖలు మారిపోయాయి. ఇంత అభివృద్ధి చేస్తు న్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి రుణపడి ఉన్నాం.

– బీటీ అతావుల్లా, వ్యాపారి, పుంగనూరు

మున్సిపాలిటీ వివరాలు

విస్తీర్ణం:	16.06 స్క్వయర్ కిలో మీటర్లు
జనాభా:	63,172
ఓటర్లు:	43,350 మంది
వార్డులు:	31
సచివాలయాలు :	16
సిబ్బంది:	203 మంది
రోడ్లు 132 కిలోమీటర్లు, కాలువలు :	117 కిలో మీటర్లు
టిడ్కో గృహాలు:	1536 మందికి పంపిణీ
ఇళ్ల పట్టాలు:	1266 మందికి పంపిణీ
డ్వాక్రా గ్రూపులు:	1064
బ్యాంకు రుణాలు, పావలావడ్డీ, రుణమాఫీ	రూ.120 కోట్లు
పెన్షన్‌దారులు:	5,532 మంది
నెలకు రూ.1.66 కోట్లు పంపిణీ	
ఇప్పటివరకు ఖర్చు చేసిన మొత్తం నిధులు	రూ.375.16 కోట్లు

కోట్లాది రూపాయలతో..



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు సీఎం గా పుంగనూరు అభివృద్ధికి కోట్లాది రూపాయలు విడుదల చేశారు. 30 ఏళ్లలో జరగని అభివృద్ధి ఐదేళ్లలోనే చేపట్టాం. నియోజకవర్గంలో ప్రభుత్వం ద్వారా లబ్ధి పొం దిన వారి వివరాలు, అభివృద్ధి వివరాలను డిజి టల్ బోర్డుల ద్వారా సచివాలయాల్లో ప్రదర్శించి పారదర్శకతను పాటించాం. మున్సిపాలిటీలోని సమస్యలను గుర్తించి అన్నివిధాల అభివృద్ధి చేస్తున్నాం. – పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మంత్రి

ఊహించని రీతిలో..



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రావడంతో మున్సిపాలి టీలో ఊహించని అభివృద్ధి జరుగుతోంది. మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి కృషితో రూ.వందల కోట్లు విడుదల చేశారు. అన్ని ప్రాంతాల్లో మౌలిక వస తులు ఏర్పాటు చేసి, పుంగనూరును ఆదర్శ మున్సిపాలిటీగా నిలిపేందుకు కృషి చేస్తున్నాం.

– ఎస్.అలీమ్‌బాషా, చైర్మన్, పుంగనూరు

అభివృద్ధి పరుగులు..



మున్సిపాలిటీలో అభివృద్ధి పరుగులు తీస్తోంది. పుం గనూరు అభివృద్ధి కలగానే మిగిలి పోతుందనుకున్న సమయంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం లోకి వచ్చాక వందల కోట్లతో రోడ్లు, కాలువలు, వీధిదీపాలు, మంచినీటి పైపులైన్లు వేశారు. ఊహించని అభివృద్ధి చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డికి, ఎంపీ మిథున్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

– సరస్వతి, విశ్రాంత ఎంఈఓ, పుంగనూరు

గుర్తు చిక్కకుండా పోతోంది..



జమీందార్ల కాలంలో ఉన్న రో డ్లను, గత పాలకులు అభివృ ద్ధి చేయలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మున్సిపాలిటీని అభివృద్ధి చేశారు. ఐదే ళ్లలో జరిగిన అభివృద్ధిని చూసి మేము నమ్మలేకపో తున్నాం. – అజీజ్‌సాహెబ్, వ్యాపారి, పుంగనూరు

బీఎల్‌ఓలతో మరోసారి సర్వే



మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లావ్యాప్తంగా ఫారం–8లో వచ్చిన మార్పులు, చేర్పులు, మరణించిన దరఖా స్తులను మరోసారి సర్వే చేయిస్తామని కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలె క్టర్ మాట్లాడుతూ బీఎల్‌ఓలతో మరోసారి ఇంటిం టి సర్వే నిర్వహిస్తామన్నారు. డబుల్ ఎంట్రీ ఓటర్లు లేరని బీఎల్‌ఓలు రాతపూర్వకంగా లెటర్లు ఇచ్చారని చెప్పారు. జిల్లాలో 93 శాతం ఓటరుకా ర్డుకు ఆధార్ లింక్ చేయడం జరిగిందన్నారు. నామినేషన్లు వేసే వరకు ఫారం–6తో కొత్త ఓటరుగా నమోదు చేసుకోవచ్చన్నారు. కలెక్టరే ట్‌లో డిప్యూటీ కలెక్టర్ అధ్యక్షతన ఒక్క టీం ప్రత్యే కంగా పని చేస్తుందన్నారు. అనుమా నం ఉన్న వాటిని ఆ టీం సభ్యులు ప్రత్యేకంగా పరిశీలిస్తారని చెప్పారు. పారదర్శకంగా ఎన్నికల కసరత్తు చేపడు తున్నట్లు తెలిపారు. సమావేశంలో డిప్యూటీ తహ సీల్దార్ త్యాగరాజులు, పలు పార్టీల ప్రతినిధులు ఉదయ్, గంగరాజు, సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

15న రీజినల్ జాబ్‌మేళా



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్: జిల్లా కేంద్రంలోని విజ్ఞానసుధ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వ ర్యంలో ఈనెల 15న రీజినల్ జాబ్‌మేళా నిర్వహిం చనున్నట్లు కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. బుధ వారం కలెక్టరేట్‌లో జాబ్‌మేళా పోస్టర్‌లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న నిరుద్యోగ యువత జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. జిల్లాలోని అన్ని గ్రామ, వార్డు సచివాలయాల్లో అర్హత కలిగిన నిరుద్యోగులకు జాబ్‌మేళా సమాచారం చేరవేయాలన్నారు. దాదాపు 100 కం పెనీలు పాల్గొంటాయని చెప్పారు. 10 వ తరగతి నుంచి పీజీ వరకు పాస్, ఫెయిల్ అయిన వారు పాల్గొనవచ్చని తెలిపారు. వయస్సు 18 నుంచి 35 సంవత్సరాల మధ్య ఉండాలన్నారు. ఇతర వివరాలకు 9063561786, 9493210966, 8142509017 నంబర్లను సంప్రదించవచ్చని తెలి పారు. ఈ కార్యక్రమంలో రీజినల్ స్కిల్ డెవలప్ మెంట్ ఆఫీసర్ శ్యాంమోహన్, జిల్లా నైపుణ్యాభి వృద్ధి సంస్థ అధికారి గుణశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

11న అనంతాళ్వార్ అవతారోత్సవం

తిరుమల: శ్రీవైష్ణవ భక్తుడు, ఆళ్వారులలో ప్రము ఖుడైన శ్రీ అనంతాళ్వార్ 970వ అవతారోత్స వాన్ని ఈనెల 11న తిరుమల పురుశైవారి తోటలో టీటీడీ ఘనంగా నిర్వహించనుంది. ఈ సందర్భం గా ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలో అనంతాళ్వార్ బోధనలు, రచనలపై సదస్సు నిర్వ హించనున్నారు. దేశవ్యాప్తంగా స్థిరపడిన అనం తాళ్వార్ వంశీయులు ప్రత్యేక పూజలు, దివ్య ప్రబంధ పాశుర పారాయణం, ఆధ్యాత్మిక ప్రవ చన కార్యక్రమాలు చేపట్టనున్నారు. పురాణాల ప్రకారం అనంతాళ్వార్ ఆదిశేషుని రూపంగా మరో శ్రీవైష్ణవ భక్తాగ్రేశ్వరుడు శ్రీరామానుజాచా ర్యులతో కలిసి ఆవిర్భవించినట్లు తెలుస్తోంది. రామానుజాచార్యుని అభిమతానుసారమే శిష్యు డైన అనంతాళ్వార్ తిరుమలకు వేంచేసి స్వామి వారి పుష్ప కైంకర్యానికి శ్రీకారం చుట్టినట్లు పు రాణ కథనాలు ఉన్నాయి. అందులో భాగంగానే ఒ కనాడు అనంతాళ్వారు నిండు గర్భిణియైన భార్య తో కలిసి స్వామివారి ఆలయం చెంత ఒక పూల తోటను ఏర్పాటు చేస్తుండగా బాలుని రూపంలో సాక్షాత్తు వేంకటేశ్వరస్వామి ప్రత్యక్షమయ్యాడు. తాను కాదన్నా తన భార్యకు పనులలో చేదోడు వాదోడుగా ఉద్యానవన నిర్మాణంలో సహకరించా డన్న కోపంతో అనంతాళ్వార్ ఆ బాలునిపై తన చేతిలో ఉన్న గునపాన్ని విసిరాడు. మరునాడు స్వామివారి మూలవిరాట్టు చుబుకం నుంచి రక్తస్రావం చూసి గాయానికి కర్పూరపు ముద్దను అంటించి శ్రీవేంకటేశ్వరస్వామివారి కృపకు పాత్రుడయ్యాడు. నేటికీ స్వామివారి చుబుకానికి కర్పూరాన్ని అంటించడం అనంతాళ్వారు దివ్యగా థను స్ఫురింపజేస్తుంది. అదే విధంగా నేటికీ మహాద్వారం చెంత అనంతాళ్వార్ స్వామివారిపై విసిరిన గునపం కూడా భక్తులకు దర్శనమిస్తోంది.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉం ది. క్యూకాంప్లెక్స్‌లో 4 కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 64,345మంది స్వామి వారిని దర్శించుకున్నారు. 20,788 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.3.71 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలం లోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 8 గం టల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

హెరిటేజ్ కోసమే విజయా డెయిరీ మూత

- రైతులను మోసం చేసిన ఘనత చంద్రబాబుదే
- జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, డీసీసీబీ చైర్‌పర్సన్ మొగసాల రెడ్డెమ్మ



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, డీసీసీబీ చైర్‌పర్సన్ మొగసాల రెడ్డెమ్మ

బైరెడ్డిపల్లె: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హెరిటేజ్ డెయిరీ లాభాల కోసమే విజయా డెయిరీని మూసివేసి రైతులను తీవ్రంగా మోసం చేశాడని చిత్తూరు జెడ్పీచైర్మన్ శ్రీనివాసులు, డీసీసీబీ చైర్‌పర్సన్ మొగసాల రెడ్డెమ్మ అన్నారు. బైరె డ్డిపల్లెలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. జిల్లాకు చెందిన మంత్రి పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డి శివశక్తి డెయిరీ ఏర్పాటు చేయడంతో ఎం తోమంది రైతులు లాభాలు పొందుతున్నారని తెలిపారు. చంద్రబాబునాయుడు గంగాధర నెల్లూ రులో నిర్వహించిన రా కదిలిరా కార్యక్రమంలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని హేళన చేస్తూ మాట్లా డడం సమంజసం కాదన్నారు. వైఎస్సార్‌సీపీ అధి కారం చేపట్టగానే మంత్రిగా రామచంద్రారెడ్డి ఆధ్వ ర్యంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయ న్నారు. చంద్రబాబునాయుడు 14 ఏళ్ల పరిపాలనలో చెప్పుకోవడానికి ఏ ఒక్క అభివృద్ధి పని కూడా లేదన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీకి తగిన గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. చంద్ర బాబు రానున్న ఎన్నికల్లో ఎలాగైనా అధికారంలోకి రావాలని కుట్ర చేస్తున్నారన్నారు. టీడీపీ, బీజేపీతో పాటు జనసేన మద్దతుగా ఉన్నాయని, ఆ నాడు రాష్ట్రానికి ఎందుకు ప్రత్యేక హోదా తీసుకురాలేకపో యారో చెప్పాలన్నారు. గత ఎన్నికల్లో రైతు, డ్వాక్రా రుణమాఫీ, తదితర హామీలను విస్మరించి ప్రజలను మోసం చేశారన్నారు. ఎన్టీఆర్‌ను గద్దె దించిన చంద్ర బాబు అధికారంలోకి వచ్చాక అప్పటి వరకు కిలో బియ్యం రూ.2 ఉంటే రూ.5.25కు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. చంద్రబాబు నాయుడు అధికారంలో ఉన్న సమయంలో కరువును మాత్రమే చూశామ న్నారు. అరకొరగా వచ్చే నీటితో సాగు చేసిన రైతులు పంటలు ఎండిపోయి తీవ్రంగా నష్టపోయిన విష యాన్ని వివరించారు. రైతుల ఆత్మహత్యలు చేసుకున్నా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్టిన తరువాత సకాలం లో వర్షాలు కురుస్తుండడంతో రైతులు ఆనందంగా వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. ప్రతిపక్ష నేతలు చెప్పే మాటలను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. కార్యక్రమంలో రాజంపేట ఎన్నికల పరి శీలకులు బైరెడ్డిపల్లె కృష్ణమూర్తి పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇంటి పట్టాల పంపిణీపై సమీక్ష


మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో జర్నలిస్టులకు ఇళ్ల పట్టాల పంపిణీకి గుర్తించిన భూమిలో హద్దులు ఏర్పాటు చేసే ప్రక్రియ వేగవంతంగా చేపట్టాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జర్నలిస్టుల హౌసింగ్ కమిటీ సభ్యులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు జర్నలిస్టులకు ఇళ్ల పట్టాలు ఇచ్చే ప్రక్రియను వేగవంతంగా చేపట్టాలన్నారు. జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీలు ఏర్పాటు చేసే ప్రక్రియ నిర్వహించాలని తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఇళ్ల పట్టాల పంపిణీకి గుర్తించిన భూమిని సర్వే చేసి సరిహద్దు రాళ్లను నాటాలన్నారు. ఈ ప్రక్రియ పూర్తి కాగానే భూమిపూజ కార్యక్రమం చేపట్టేందుకు కసరత్తు చేయాలన్నారు. పుంగనూరు, వి.కోటలో భూమి గుర్తించే ప్రక్రియను జర్నలిస్టులను సమన్వయం చేసుకుని పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, డీఆర్‌ఓ పుల్లయ్య, ఆర్డీఓలు చిన్నయ్య, మనోజ్ కుమార్, శ్రీనివాసులు, జిల్లా సర్వే శాఖ ఏడీ గౌస్‌బాషా, కమిటీ మెంబర్లు సహదేవ, డీపీఆర్‌ఓ పద్మజ, చిత్తూరు ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు లోకనాథం, అశోక్‌కుమార్, ఇతర జర్నలిస్టులు పాల్గొన్నారు.

9 నుంచి నులి పురుగుల నివారణ మందుల పంపిణీ

నగరి : జిల్లాలో ఈ నెల 9వ తేదీ నుంచి నులిపురుగుల నివారణ మందులు పంపిణీ చేస్తామని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ రవిరాజు అన్నారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో నులిపురుగుల నివారణ మందుల పంపిణీకి సంబంధిత పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ అనిమియా నివారణకు నులిపురుగుల మందులను పిల్లలకు తప్పనిసరిగా వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ శ్రీదేవి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమ బడ్జెట్

- సంక్షేమం, అభివృద్ధికి సమతూకంగా నిధుల కేటాయింపు
- విద్యాభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత
- రూ.385 కోట్లతో చిత్తూరు డెయిరీ పునరుద్ధరణకు చర్యలు
- కుప్పం బ్రాంచ్ కెనాల్ పూర్తి
- తిరుపతికి ఏసీ ఎలక్ట్రానిక్ బస్సులు
- అన్నివర్గాల సంక్షేమమే లక్ష్యంగా బడ్జెట్

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్రప్రభుత్వం బుధవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన 2024–2025 రాష్ట్ర బడ్జెట్ జనరంజకంగా ఉంది. ఈ పద్దులో అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పించారు. వ్యవసాయం, విద్య, వైద్యం, సంక్షేమం ఇలా అన్ని రంగాలకు పెద్దపీట వేశారు. రాజకీయంగా, అభివృద్ధి పరంగా అధికారంలోకి వచ్చినప్పటి నుంచి చిత్తూరు, తిరుపతి జిల్లాల అభివృద్ధి పట్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అపారమైన అభిమానం చూపిస్తోంది. రాష్ట్రబడ్జెట్‌లో చిత్తూరు, తిరుపతి జిల్లాలకు కీలక కేటాయింపులు జరిగాయి. ఈ బడ్జెట్ అన్ని వర్గాలకు న్యాయం జరిగేలా ఆమోదయోగ్యంగా ఉండడంతో సర్వత్రా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ప్రాధాన్యతగా ఉన్న నవరత్నాల పథకాలకు నిధులు కేటాయిస్తూనే మరోవైపు అభివృద్ధి కార్యక్రమాలకు కేటాయింపులు జరిగాయి.



బడ్జెట్‌లో రెండు జిల్లాల కీలక అంశాలు..

- అమూల్ సంస్థ సహకారంతో రూ.385 కోట్ల పెట్టుబడితో చిత్తూరు డెయిరీ పునరుద్ధరణ చర్యలు. హెరిటేజ్ సంస్థ కోసం ఆ డెయిరీని చంద్రబాబునాయుడు మూసివేశారు. గత ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చిత్తూరు డెయిరీని తెరిపించారు. ఈ డెయిరీ పునరుద్ధరణ చర్యల వల్ల 5 వేల మందికి ప్రత్యక్షంగా, 2 లక్షల మందికి పరోక్షంగా ఉపాధి కలుగుతుంది.
- తిరుపతి జిల్లాకేంద్రం రేణిగుంటలో ఉన్న విమానాశ్రయం అభివృద్ధి పనులు పునరుద్ధరించబడ్డాయి.
- హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ రెండో దశలో కుప్పం బ్రాంచ్‌కెనాల్ పనులు వేగవంతం చేసి పూర్తి చేయబడ్డాయి. ఈ నెలలో ప్రారంభోత్సవానికి సన్నాహాలు. కుప్పం నియోజకవర్గంలోని 110 మైనర్ ఇరిగేషన్ ట్యాంకులకు కుప్పం బ్రాంచ్‌కెనాల్ వల్ల నీరు లభ్యమవుతుంది.
- సుస్థిర పర్యావరణ ప్రమాణాలను పాటిస్తూ ప్రజల రవాణా అవసరాలను తీర్చేందుకు తిరుపతి జిల్లాలో 100 ఏసీ ఎలక్ట్రానిక్ బస్సులను ప్రవేశపెట్టడం జరిగింది. వీటితో పాటు కొత్తగా 1500 కొత్త డీజిల్ బీఎస్–6 బస్సులకు అనుమతులు ఇచ్చారు.
- పుంగనూరు పశువులను సంరక్షిస్తున్నందుకు గానూ తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర పశు విశ్వవిద్యాలయం, భారతీయ వ్యవసాయ పరిశోధనా సంస్థ నుంచి బ్రీడ్ కన్జర్వేషన్ అవార్డును అందుకుంది.
- గ్రామ పంచాయతీల్లో థీమాటిక్ అప్రోచ్‌స్–హెల్తీ విలేజ్‌లో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణకు పంచాయతీ రాజ్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఈ ఏడాది జనవరిలో 3 రోజుల పాటు జాతీయ శిక్షణా శిబిరాలను తిరుపతిలో నిర్వహించడం జరిగింది.
- 2023 ఫిబ్రవరిలో తిరుపతిలో ఇండియా ఎలక్ట్రానిక్స్ అండ్ సెమీకండక్టర్ అసోషియేషన్ భాగస్వామ్యంతో డిఫెన్స్ ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్ ఇన్నోవేషన్ సమావేశాలు నిర్వహించడం జరిగింది.

జనరంజకంగా ఉంది..



రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ జనరంజకంగా ఉంది. అన్నివర్గాల ప్రజలకు అనుకూలంగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. సంక్షేమం, అభివృద్ధి, పారిశ్రామిక అభివృద్ధి, నిరుద్యోగ నిర్మూలన అంశాలతో ఆమోదయోగ్యంగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ప్రభుత్వం అన్ని సామాజిక వర్గాలకు ప్రాధాన్యతనిస్తోంది.

- వినాయకం, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

మహిళా సాధికారతకు ప్రాధాన్యం



గతంలో ఏ ప్రభుత్వం మహిళా సాధికారతకు ప్రాధాన్యత ఇవ్వలేదు. ఈ ప్రభుత్వంలో మహిళా సాధికారతకు ప్రాధాన్యత ఇచ్చింది. బడ్జెట్‌లో మహిళా సాధికారతకు పెద్దపీట వేశారు. అలాగే విద్య, వైద్యరంగాలకు మంచి ప్రాధాన్యతనిచ్చారు. మహిళా శిశు సంక్షేమానికి అధిక ప్రాధాన్యత నివ్వడం హర్షణీయం.

- కావేరి, వ్యాపారి, చిత్తూరు నగరం

వ్యవసాయానికి అధిక నిధులు..



రాష్ట్రప్రజల శ్రేయస్సు కోసం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ చారిత్రాత్మకంగా నిలిచింది. ప్రధానంగా వ్యవసాయ రంగానికి అధిక నిధులు కేటాయించారు. రాష్ట్ర ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం బడ్జెట్‌ను రూపొందించడం సంతోషకరం.

- చెంగారెడ్డి, పుంగనూరు

సంక్షేమానికి ప్రాధాన్యం..



రాష్ట్రబడ్జెట్‌లో అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చారు. జగనన్న అమ్మఒడి, నాడు–నేడు, ఉన్నత విద్యలో కీలకమైన జగనన్న విద్యాదీవెన, జగనన్న విద్యాకానుక వంటి పథకాలకు మెరుగైన కేటాయింపులు చేయడం మంచి విషయం.

- హేమారెడ్డి, హెడ్‌మాస్టర్, కార్వేటినగరం మండలం

సమగ్ర సూచిక..



రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ రాష్ట్ర, జిల్లా సమగ్రాభివృద్ధికి పెద్దపీట వేసేలా ఉంది. ముఖ్యంగా ప్రతి పేదవాడికి నాణ్యమైన విద్య, మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వ కృషి అభినందనీయం. అందులో భాగంగానే విద్య, వైద్యం, రైతుల కోసం జరిపిన కేటాయింపులు అమోఘం.

- కుప్పారెడ్డి, రైతు

పేదల బడ్జెట్..



2024–25 ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను పేదల బడ్జెట్‌గా భావిస్తున్నాం. ప్రాధాన్యత అంశాలకు పెద్దపీట వేశారు. పేదలు, మధ్యతరగతి ప్రజలతో పాటు కార్మికులను దృష్టిలో ఉంచుకుని బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. విద్య, వైద్యం, వ్యవసాయానికి ఈ ప్రభుత్వం ప్రారంభం నుంచే ప్రాధాన్యత ఇస్తోంది.

- చల్లా చంద్రయ్య, ఆర్టీసీ వైఎస్సార్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు

ఆర్థిక వృద్ధి రేటు పెరిగేలా..



శాసనసభలో ఆర్థికమంత్రి బుగ్గన ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో రాష్ట్ర ఆర్థికవృద్ధి రేటు పెరగడంతో రాష్ట్రం అభివృద్ధి సూచిక కనిపిస్తోంది. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కోవిడ్ మహమ్మారిని ఎదుర్కొని రాష్ట్రం అన్ని రంగాల్లో పురోగతిని సాధించడం హర్షదాయకం.

- సోమచంద్రారెడ్డి, పలమనేరు మేధావుల ఫోరం కన్వీనర్

వెనుకబడిన కులాల కోసం..



సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబం అభివృద్ధి చెందాలని కోరుతున్న సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో ఇదే అంశానికి ప్రాధాన్యత ఇచ్చారు. మరోవైపు వెనుకబడిన కులాల కోసం రికార్డు స్థాయిలో ఏకంగా రూ.71,740 కోట్లు కేటాయించడం ఆహ్వానించదగ్గ విషయం.

- ఆర్ముగం, శాంతిపురం

విద్య, వైద్యానికి అధికం..



రాష్ట్రప్రభుత్వం ఈరోజు ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజా సంక్షేమానికి దిక్సూచిగా నిలిచింది. ఇందులో ప్రధానంగా విద్య, వైద్యంతో పాటు బీసీల సంక్షేమం కోసం రూ.71 కోట్లు బడ్జెట్‌లో కేటాయించడం శుభ పరిణామం. అదేవిధంగా ప్రతి మెడికల్ కాలేజీల అభివృద్ధి కోసం నిధులు కేటాయించారు.

- డాక్టర్ సురేంద్రనాథ్ రెడ్డి, ఎస్వీయూ పాలకమండలి సభ్యులు

హర్షదాయకం..



రాష్ట్రప్రభుత్వం ఈ ఆర్థిక సంవత్సరానికి గానూ ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో విద్యకు అధిక నిధులు కేటాయించారు. విద్యాభివృద్ధికి అధిక నిధులు, పేదలకు నాణ్యమైన విద్య, అన్నివర్గాలకు మేలు జరిగేలా బడ్జెట్ కేటాయింపులు జరిగాయి. అలాగే కుప్పం బ్రాంచ్ కెనాల్ పూర్తి చేసేలా చర్యలు చేపట్టడం ఆనందదాయకం.

- నాగరాజు, రైతు, కుప్పం

వినాయకుని హుండీ ఆదాయం రూ.1.21కోట్లు


కానుకలను లెక్కిస్తున్న ఆలయ అధికారులు, సిబ్బంది

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి హుండీ ఆదాయం రూ.1.21 కోట్లు వచ్చినట్లు ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. గత 20 రోజుల హుండీ ఆదాయాన్ని బుధవారం ఉదయం ఆలయ ఆస్థాన మండపంలో లెక్కించగా 22 గ్రాముల బంగారం, 1కేజీ 500ల గ్రాముల వెండి, గోసంరక్షణ హుండీ ద్వారా రూ.14 వేలు, ఫారిన్ కరెన్సీ యూఎస్‌ఏ 626 డాలర్లు, ఆస్ట్రేలియా 60 డాలర్లు, ఇంగ్లాండ్ 20 పౌండ్లు, యూఏఈ 35 ధీరమ్స్, మలేసియా 428 రింగిట్స్, 45 యూరోలు, కెనడా 130 డాలర్లతో కలిపి మొత్తం రూ.1.21 కోట్లు ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఈ ఆదాయాన్ని ఆలయ అభివృద్ధి పనులకు ఉపయోగించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓలు ఎస్వీ కృష్ణారెడ్డి, రవీంద్రబాబు, విద్యాసాగర్ రెడ్డి, ధనుంజయ, పర్యవేక్షకులు కోదండపాణి, శ్రీధర్‌బాబు, ఆలయ సిబ్బంది, కాణిపాక యూనియన్ బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

డీఆర్‌ఓగా పుల్లయ్య


బాధ్యతలు స్వీకరిస్తున్న నూతన డీఆర్‌ఓ పుల్లయ్య

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాకు నూతనంగా విచ్చేసిన డీఆర్‌ఓ (జిల్లా రెవెన్యూ అధికారి) బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. పూర్వపు డీఆర్‌ఓ రాజశేఖర్ ఆయనకు బాధ్యతలు అప్పజెప్పారు. మొదట కలెక్టర్ షణ్మోహన్, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులును ఆయన మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి పరిచయం చేసుకున్నారు. బాధ్యతలు స్వీకరించిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. గతంలో కర్నూలు, నంద్యాల జిల్లాల్లో డీఆర్‌ఓగా విధులు నిర్వహించిన అనుభవం ఉందన్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆయనను కలెక్టరేట్ ఏఓ వెంకటేశ్వరన్, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు కలిసి పుష్పగుచ్చాలు అందజేసి పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య


ఆత్మహత్య చేసుకున్న రంజిత్‌కుమార్

బంగారుపాళెం: కుటుంబ కలహాలతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం రాత్రి మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ఇలా.. కొత్తపల్లెకు చెందిన సుబ్బయ్య కుమారుడు రంజిత్‌కుమార్(25) తగ్గువారిపల్లె ఇందిరమ్మ కాలనీలో కుటుంబ సభ్యులతో కలసి ఉంటున్నాడు. రంజిత్ కుమార్ పెయింటిగ్ పనులు చేసుకుంటున్నాడు. పనులుకు వెళ్లే విషయంపై కుటుంబ సభ్యులు రంజిత్‌కుమార్‌ను మందలించడంతో మనస్థాపానికి గురై ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయాన్ని గుర్తించిన కుటుంబ సభ్యులు తలుపులు పగులగొట్టి రంజిత్‌కుమార్‌ను 108 ద్వారా బంగారుపాళెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఐదు నెలల కుమారుడు ఉన్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బస్సు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు


క్షతగాత్రుడు

వి.కోట: ద్విచక్రవాహనాన్ని తమిళనాడు ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడిన సంఘటన మండలంలోని వి.కోట–పలమనేరు జాతీయ రహదారిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. బైరెడ్డిపల్లి మండలం కంచనపల్లికి చెందిన రాజేంద్ర (37), నీలకంఠ (47) బైక్‌పై బుధవారం వి.కోట వైపు నుంచి బైరెడ్డిపల్లికి వెళ్తున్నారు. అదే సమయంలో తిరుపతి నుంచి ధర్మపురికి వెళ్తున్న తమిళనాడు ఆర్టీసీ బస్సు మండలంలోని రాఘవపల్లి గ్రామం వద్ద ప్రమాదవశాత్తు ఎదురుగా వస్తున్న వీరి బైక్‌ను ఢీకొట్టింది. స్థానికులు క్షతగాత్రులను 108 వాహనంలో బైరెడ్డిపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం పలమనేరు ఆస్పత్రికి తరలించారు. అనంతరం తమిళనాడు బస్సును స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ లింగప్ప తెలిపారు.

20న ఖాళీ టిన్ల విక్రయానికి టెండర్లు

తిరుపతి(అలిపిరి): తిరుమల శ్రీవారి ఆలయంతో పాటు ఇతర అనుబంధ ఆలయాల్లో నెయ్యి, నూనె, జీడిపప్పు ప్యాకింగ్‌కు వినియోగించిన ఖాళీ టిన్ల విక్రయానికి కాంట్రాక్ట్ కింద సీల్డ్ టెండర్లను టీటీడీ ఆహ్వానిస్తోంది. టెండర్ పొందిన వారు ఈ ఏడాది డిసెంబరు వరకు ఖాళీ టిన్లను సేకరించవచ్చని టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి తెలిపారు. తిరుపతి హరేకృష్ణ రోడ్డులోని మార్కెటింగ్ (వేలం) కార్యాలయంలో సీల్డ్ టెండర్లు ఈనెల 20వ తేదీ మధ్యాహ్నం 3 గంటలలోపు అంద జేయాలన్నారు. వివరాలకు మార్కెటింగ్ కార్యాలయంలో లేదా ఫోన్‌నంబర్ 0877–2264429ను సంప్రదించవచ్చని తెలిపారు.

చిత్తశుద్ధితో ఎన్నికల విధులు నిర్వర్తించండి


కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో పాల్గొన్న ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు

- లాగిన్‌ల పాస్‌వర్డ్‌లు జాగ్రత్తగా వినియోగించండి
- ప్రతి మండలంలో ఎన్నికల ప్రక్రియకు కోర్ టీమ్‌లు
- చట్ట పరిధిలోనే పని చేయండి
- ఈఆర్‌ఓ, ఏఈఆర్‌ఓల సమావేశంలో కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : ఎన్నికల విధులు చట్టపరిధిలోనే ప్రతి ఒక్కరూ నిర్వర్తించాలని కలెక్టర్ షణ్మోహన్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో ఎన్నికల కసరత్తుపై ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గతంలో ఎన్నికల విధులు ఎన్నిసార్లు నిర్వర్తించినా ప్రస్తుతం కొత్తగా ఉంటుందన్నారు. ప్రతిఒక్కరూ ఎన్నికల హ్యాండ్‌బుక్‌ను కచ్చితంగా చదవాలన్నారు. ఎన్నికల ప్రక్రియకు ప్రతి మండలంలో కోర్ టీంలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఎన్నికల కసరత్తులో లాగిన్ పాస్‌వర్డ్‌లను జాగ్రత్తగా వినియోగించాలన్నారు. పాస్‌వర్డ్‌లను ఇతరులకు ఎట్టి పరిస్థితుల్లోనూ చెప్పకూడదని తెలిపారు. ఎన్నికల విధులు అలసత్వం లేకుండా నిర్వర్తించాలని చెప్పారు. 18 ఏళ్లు దాటిన యువత కొత్తగా ఫారం–6 ద్వారా ఓటర్ నమోదుకు ఇచ్చినప్పుడు ఫారం–6తో పాటుగా ఆధార్ కార్డు, స్కూల్ సర్టిఫికెట్, బర్త్ సర్టిఫికెట్‌ను తీసుకోవాలన్నారు. ఫారం–7 తీసివేయడం, మైగ్రేషన్ తీసుకోరాదని చెప్పారు. జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో ఉన్న డెత్ సర్టిఫికెట్‌లను పరిశీలించాలని సూచించారు. ఈఆర్‌ఓలు అంతా వారికి సంబంధించిన నియోజకవర్గం పరిధిలో రూట్లు ఒక్కసారి పరిశీలించుకోవాలని సూచించారు. ఏఈఆర్‌ఓలు ప్రతి మండల పరిధిలోని పోలింగ్ కేంద్రాలు వాటికి సంబంధించిన రూట్లలో పోలింగ్ కేంద్రాల్లో గల సౌకర్యాలను పరిశీలించి రిపోర్టును అందజేయాలని ఆదేశించారు.

చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించండి..

ఎన్నికలు విధులు నిర్వర్తించే ప్రతిఒక్కరూ చిత్తశుద్ధితో పనిచేయాలని కలెక్టర్ షణ్మోహన్ అన్నారు. జిల్లాలోని ఎంఈఓలతో సమావేశం నిర్వహించి తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో ఏమైనా పనులు పెండింగ్‌లో ఉంటే ఫిబ్రవరి 21వ తేదీలోపు పూర్తి చేయాలన్నారు. ప్రతి మండలంలో ఒక ఆదర్శ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని తెలిపారు. జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ ఎన్నికల పనులు ఎప్పటికప్పుడే పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ పుల్లయ్య, డ్వామా పీడీ రాజశేఖర్, ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు పాల్గొన్నారు.

బోయకొండ గంగమ్మ ఆలయానికి భారీ ఆదాయం

- వివిధ హక్కుల కోసం వేలం నిర్వహించిన ఆలయ పాలకమండలి
- మొత్తం రూ.3.18 కోట్లు రాబడి
- చైర్మన్ నాగరాజరెడ్డి, ఈఓ చంద్రమౌళి


మాట్లాడుతున్న చైర్మన్ నాగరాజరెడ్డి, పక్కన ఈఓ చంద్రమౌళి

చౌడేపల్లి: ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయానికి వివిధ హక్కులపై నిర్వహించిన వేలంపాట ద్వారా రూ.3.18 కోట్ల పైచిలుకు ఆదాయం సమకూరినట్లు చైర్మన్ నాగరాజ రెడ్డి, ఈఓ చంద్రమౌళి తెలిపారు. బుధవారం బోయకొండ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలో ఆలయ చైర్మన్ నాగరాజ రెడ్డి ఆధ్వర్యంలో వేలంపాటను నిర్వహించారు. ఆలయం వద్ద కొబ్బరికాయలు, పూజాసామగ్రి ఏడాది పాటు విక్రయ హక్కును రమణ రూ.50.27 లక్షలకు వేలంలో దక్కించుకున్నారు. అదేవిధంగా ఆలయంలో పూలహారాలు, నిమ్మకాయ హారాలు, వడిబాల సామగ్రి, చీరలు, జాకెట్ పీసులు విక్రయ హక్కును రఘుపతి రూ.40 లక్షలు, పెద్దభోగం, చిన్నభోగం సేకరించి నిర్వహించుకునే హక్కును లోకేష్ రూ.90.4 లక్షలు, భక్తులు పెద్దభోగం, చిన్నభోగం శుభ్రపరిచి ఇచ్చు హక్కును సురేష్‌బాబు రూ.57.2 లక్షలు, కొండపైన క్లాత్‌రూం నిర్వహించుకునే హక్కు అంటే (సెల్‌ఫోన్, లగేజీలు మాత్రమే) రూ.36.40 లక్షలు, అమ్మవారికి భక్తులు కానుకలుగా ఇచ్చే చీరలు, రవికలను సేకరించుకునే హక్కును లలితమ్మ రూ.45 లక్షలు వేలం పాట పాడి దక్కించుకున్నారని ఈఓ తెలిపారు. గత సంవత్సరంతో పోలిస్తే వేలం పాట ద్వారా ఈసారి రూ.56 లక్షల 38,884 రూపాయలు అధికంగా సమకూరిందన్నారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యుడు రామదాసు, భారతి, బుడ్డమ్మ, పవన్‌కుమార్, భాస్కర్‌రెడ్డి, హైమావతి, రెడ్డెమ్మ, ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, దిగువపల్లి సర్పంచ్ సోని, కార్యదర్శి వసుంధర తదితరులు పాల్గొన్నారు.